ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం BHADRADRI KOTHAGUDEM

మంగళవారం, 26 మార్చి 2024 5

	గరిష్టం	కనిష్టం
ఖమ్మం	38	24
భద్రాద్రి	38	23

రంజాన్‌మాసం
ఇఫ్తార్ (సా) : 6:27 (మంగళవారం)
సహర్ (ఉ) : 4:47 (బుధవారం)

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా హోలీ సంబురాలు అంబరాన్నంటాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా ఉల్లాసంగా.. ఉత్సాహంగా రంగులలో మునిగి తేలారు. కొందరు ఆదివారమే హోలీ నిర్వహించినా క్యాలెండర్ ప్రకారం సోమవారమే అత్యధికులు హోలీ ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే వీధుల కూడళ్లలో కామదహనం కార్యక్రమాలు నిర్వహించి ఉదయం నుంచి రంగుల పండుగ ప్రారంభించారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

- ఇరు జిల్లాల్లో ఘనంగా హోలీ వేడుకలు
- ఖమ్మంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, సీపీ సునీల్‌దత్
- కొత్తగూడెంలో కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం సాంస్కృతికం, మార్చి 25: ఇరుజిల్లాల్లో హోలీ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా, ఆడ, మగ తేడా లేకుండా ఇరుగు పొరుగు వారితో హోలీ సంబురాలు చేసుకున్నారు. పిల్లలు కలర్ గన్స్‌తో సందడి చేశారు. ఖమ్మం నగరంలోని కమాన్‌బజార్‌లో సామూహికంగా హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సంబురాల్లో స్థానిక దుకాణదారులు, సిబ్బంది ఆడిపాడారు. వ్యవసాయ మార్కెట్, తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో హోలీ సందడి కనిపించింది. పలు కార్యాలయాల వద్ద అధికారులు సైతం తమ సిబ్బందితో కలిసి హోలీ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఖమ్మం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌లో జరిగిన హోలీ సంబురాల్లో కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్‌దత్‌లు పాల్గొన్నారు. సీపీ క్యాంప్ ఆఫీసులో జరిగిన వేడుకల్లో సీపీ సునీల్‌దత్, నిశితాశర్మ దంపతులు పాల్గొన్నారు. గొల్లగూడెంలోని శ్రీకృష్ణగోశాలలో రాజస్థానీ సమాజ్, నవయువక మండలి ఆధ్వర్యంలో చైన్‌సింగ్‌రాజ్ పురోహిత్, ఓం నారాయణ ఖండేవాల్, కేసా హనుమంతరావులు హోలీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవులను పూజించి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ పాల్గొన్నారు.



రంగులు పులుముకుంటున్న ఖమ్మం కలెక్టర్, సీపీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ సోమవారం హోలీ సంబురాలు నిర్వహించారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట నియోజకవర్గాలతోపాటు నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో చిన్నా, పెద్దా తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజలు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. యువకులు రోడ్లపైకి వచ్చి రంగులతో చిందులు వేశారు. కొత్తగూడెం కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్, రామవరం ప్రాంతాలతోపాటు చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు రంగులు చల్లుకుని సంబురాలు చేసుకున్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ దంపతులు పాల్గొన్నారు. వేడుకల్లో మహిళా శిశు సంక్షేమ అధికారి విజేత, పరిపాలనాధికారి గన్యా, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ రోహిత్‌రాజు జిల్లా అధికారులతో కలిసి హోలీ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం అధికారులంతా హేమచంద్రాపురంలోని పోలీస్‌హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకుని పోలీస్ బ్యాండ్ చప్పుళ్లకు నృత్యాలు చేశారు. వేడుకల్లో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్, ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్‌సింగ్ పాల్గొన్నారు. హోలీ సందర్భంగా జూలూరుపాడులోని కృష్ణుడి ఆలయం, కాకర్ల వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రంగులు పులుముకుంటున్న భద్రాద్రి కలెక్టర్, ఐటీడీఏ పీవో

లోక్యాతండాలో రెండోరోజూ హోలీ వేడుకలు
సంప్రదాయబద్ధంగా డూండ్ కార్యక్రమం 7

రామయ్యకు వసంతోత్సవ శోభ



- భద్రాద్రిలో వైభవంగా డోలోత్సవం, వసంతోత్సవం
- ప్రారంభమైన సీతారాముల కల్యాణ పనులు
- తొలిరోజు 25 క్వింటాళ్ల తలంబ్రాల తయారీ
- తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులు

భద్రాచలం, మార్చి 25: హోలీపౌర్ణమి సందర్భంగా భద్రాచలంలోని శ్రీరామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం వసంతోత్సవం, డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. ఏప్రిల్ 17న సీతారాముల కల్యాణంలో వినియోగించే తలంబ్రాల తయారీ పనులకు సోమవారం సంప్రదాయబద్ధంగా శ్రీకారం చుట్టారు. డోలోత్సవం సందర్భంగా దేవస్థానంలో తొలుత ఉత్సవమూర్తులకు పంచామృతాలతో ప్రత్యేక స్నపనం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల అందంగా అలంకరించిన ఊయలలో సీతారామలక్ష్మణులను ఆసీనులను చేశారు. ఆస్థాన గాయకులు రామదాసు, తూము నర్సింహదాసు కీర్తనలు ఆలపిస్తుండగా స్వామివారికి నక్షత్ర, కుంభ హారతులను సమర్పించారు.

ఆహ్లాదకరంగా వసంతోత్సవం

భద్రాద్రి రామయ్యకు హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని వసంతోత్సవాన్ని నిర్వహించారు. వాల్మీకి రామాయణం ఆధారంగా సీతారాముల కల్యాణం జరిగిన రోజు, హోళిక అనే రాక్షసిని సంహరించిన రోజు కావడంతో వసంతోత్సవాన్ని నిర్వహించడం భద్రాద్రిలో సంప్రదాయంగా మారింది. అయితే స్థానిక ప్రజలు, భక్తులు భద్రాద్రి రామయ్యకు వసంతం చల్లిన రోజున పెళ్లి కొడుకుగా ముస్తాబు చేసినట్లుగా భావిస్తారు. ఉగాదికి 15 రోజుల ముందు స్వామివారిని పెళ్లి కుమారుడిని చేసి ఉగాది పండుగ వెళ్లిన తొమ్మిదో రోజున కల్యాణాన్ని నిర్వహిస్తారు. వాస్తవానికి చైత్రశుద్ధ పంచమి రోజు స్వామివారిని పెళ్లికుమారుడిని చేస్తారు.

ఆగమ శాస్త్రం ప్రకారం హోలీ పౌర్ణమిని పురస్కరించుకొని వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ప్రధాన ఆలయంలోని ధ్రువమూర్తులకు, ఆంజనేయస్వామికి, లక్ష్మీతాయారు అమ్మవారికి శాస్త్రోక్తంగా వసంతం చల్లి అనంతరం వసంతోత్సవ కార్యక్రమానికి చిహ్నంగా భక్తులపై పసుపు నీళ్లను చల్లారు. ఉత్సవాల సందర్భంగా సాయంత్రం శ్రీ సీతారామచంద్రలక్ష్మణస్వాములకు తిరువీధిసేవ నిర్వహించారు. కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేశ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్ వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

తొలిరోజు 25 క్వింటాళ్ల తలంబ్రాల తయారీ

శ్రీరామ నవమి రోజు భద్రాద్రి రామయ్య కల్యాణంలో వినియోగించే తలంబ్రాల తయారీ కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టారు. స్థానిక మిథిలా స్టేడియం స్వాగత ద్వారం వద్ద సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కల్యాణ కార్యక్రమంలో పాల్గొనే రుత్వికుల సతీమణులు రోట్లో పసుపు దంచారు. అలాగే తలంబ్రాలను సైతం కలిపారు. అనంతరం పసుపు, కుంకుమ, నెయ్యి, బుక్క గులాల్, అత్తర్, పన్నీర్, నూనె, సుగంధ ద్రవ్యాలులు కలిపి తలంబ్రాలను సిద్ధం చేశారు. ఈసారి రామయ్య కల్యాణానికి 300 క్వింటాళ్ల తలంబ్రాలు సిద్ధం చేయాలని భావిస్తుండగా తొలి రోజు 25 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా డోలోత్సవాన్ని, వసంతోత్సవాన్ని తిలకించేందుకు అలాగే రామయ్య కల్యాణ తలంబ్రాలు కలిపేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు భద్రాద్రికి పాదయాత్రగా తరలివచ్చారు. ఉత్సవాల నేపథ్యంలో సోమవారం రామయ్య నిత్యకల్యాణాన్ని నిలిపివేశారు.



కల్యాణ తలంబ్రాల తయారీలో భక్తులతో కలిసి పాల్గొన్న దేవస్థానం ఈవో రమాదేవి



వసంతోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యాసంగి వరి ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి సీజన్‌లోనూ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించే ధాన్యంలో సుమారు 25 శాతం ఖమ్మం జిల్లా నుంచే ఉంటోంది. కానీ ఈసారి సాగర్ జలాలు రాకపోవడంతో జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది.



లక్ష్యం లేకుండానే సేకరణ

- ఉమ్మడి జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సన్నాహాలు
- ఖమ్మం జిల్లాలో 223, భద్రాద్రిలో 110 కేంద్రాల ఏర్పాటు

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 25: గతేడాది 2.50లక్షల ఎకరాల్లో సాగు కాగా ఈ ఏడాది కేవలం లక్ష రెండు వేల ఎకరాల్లోనే సాగయ్యింది. అదీ బోర్లు, బావుల కింద మాత్రమే సాగయ్యింది. దీంతో ఈ సీజన్‌లోనూ 2లక్షల 46వేల 612 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ఆశిస్తున్నారు. ఈ మేరకు ఖమ్మం జిల్లాలో 223, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. ఏప్రిల్ చివరి వారంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు యోచిస్తున్నారు. అయితే ఎంత ధాన్యం సేకరించాలనే లక్ష్యం లేకుండానే కొనుగోళ్ల ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో సుమారు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. వానాకాలంలో సన్నబియ్యం సాగుతో కాలం కలిసి రాకపోవడంతో దిగుబడులు తగ్గాయి. ప్రస్తుత యాసంగిలోనూ వరి సాగు సగానికి సగం తగ్గిపోయింది. అధికారులు ఊహిస్తున్నట్లు ఈసారి కొనుగోలు కేంద్రాలకు అంతగా ధాన్యం రాకపోవచ్చని భావిస్తున్నారు. బయట మార్కెట్లో రైతులకు ధాన్యానికి మంచి ధర లభిస్తోందని, దీంతో కేంద్రాలకు వచ్చేది తక్కువగానే ఉంటుందని భావిస్తున్నారు. వాస్తవానికి జిల్లాలో యాసంగిలో వరికి క్రాప్ హాలీడేను ప్రకటించారు. ఇప్పటివరకు బోర్లు బావుల కింద సాగు అయిన వరి గణాంకాల ప్రకారం వ్యవసాయ శాఖ అంచనాలను లెక్కకట్టింది. దీని ప్రకారం 1లక్ష 02 వేల ఎకరాల్లో వరి సాగయ్యింది. వీటి ద్వారా సుమారు 2లక్షల 46వేల 612 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా వేసింది. దీనికి తగినట్లు ధాన్యం సేకరించేందుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ధాన్యం సిద్ధమవుతోంది. ఈ నెల చివరి వారం నుంచి పంట కోతలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

ఖమ్మం జిల్లాలో వరి సాగు	: 1లక్ష 02 వేల ఎకరాలు
ధాన్యం దిగుబడి అంచనా	: 2,46,612 మెట్రిక్ టన్నులు
భద్రాద్రిజిల్లాలో వరిసాగు	: 51,739 ఎకరాలు
ధాన్యం దిగుబడి అంచనా	: 1,29,348 మెట్రిక్ టన్నులు

సేకరణకు కార్యాచరణ ఇలా..

యాసంగిలో సాగైన వరి విస్తీర్ణం, దొడ్డురకం బియ్యం దిగుబడి వివరాలను మండలాల వారీగా వ్యవసాయశాఖ అధికారులు గుర్తించి పౌరసరఫరాల శాఖకు లెక్కలు అందించాల్సి ఉంది. ఆ తర్వాత సహకార, గ్రామీణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకుని కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాల్సి ఉంది. ఇందులో కేంద్రాల సంఖ్య, గోనెసంచులు, మిల్లింగ్ కోసం మిల్లుల గుర్తింపు, ధాన్యం తరలించేందుకు వాహనాల సేకరణ తదితర అంశాలు ఉంటాయి. అయితే వ్యవసాయశాఖ అంచనాలతోనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రాథమికంగా చర్చించి నివేదికలను సిద్ధం చేశారు. జిల్లాలో డీఆర్డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్, ఏఎంసీ ద్వారా ఖమ్మం జిల్లాలో 223, భద్రాద్రి జిల్లాలో 110 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. కోటి వరకు గోనెసంచులు అవసరం ఉంటుందని అంచనాలు వేశారు. టార్పాలిన్స్, తూర్పారపట్టే మిషన్లు, ప్యాడీ శుభ్రపరిచే యంత్రాలు, మాయిశ్చరైజ్ యంత్రాలు, వేయింగ్ మిషన్లు, హస్క్ రిమూవర్స్ అన్ని సిద్ధంగా ఉంచారు. జిల్లాలో 18 గోదాముల్లో ధాన్యాన్ని నిల్వ చేసే గోదాములను సిద్ధం చేస్తున్నారు.

‘బెల్ట్’ మూసేదెవరు?

- లోక్‌సభ ఎన్నికల వేళ ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం
- మద్యం బెల్ట్ దుకాణాల మూసివేతపై దాటవేత ధోరణి
- ఎక్సైజ్‌శాఖ విధులు నిర్వహిస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది



ఫ్లైయింగ్ స్క్వాడ్ వాహనంలో ఎక్సైజ్‌స్టేషన్‌కు తరలించిన మద్యం

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 25: ఎన్నికల వేళ ఏ ప్రభుత్వశాఖల అధికారులు చేయాల్సిన పనులు ఆయా శాఖల అధికారులే నిబంధనల మేరకు నిర్వహిస్తే పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో మద్యం పంపిణీని నిరోధించి రాష్ట్రంలోనే అత్యధికంగా కేసులు నమోదు చేసి ఆదర్శవంతంగా నిలిచిన ఖమ్మం జిల్లా ఎక్సైజ్‌శాఖ ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల సమయంలో మాత్రం పలు విమర్శలను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా బెల్ట్ దుకాణాల మూసివేత విషయంలో దాటవేత ధోరణితో వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులే బెల్ట్ దుకాణాలను పరిశీలిస్తూ ఎక్సైజ్‌శాఖ విధులు నిర్వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల వేళ శాంతి భద్రతలు సక్రమంగా ఉండాలన్నా, ఎన్నికలు ప్రశాంతంగా జరగాలన్నా.. మద్యం అమ్మకాలపై పూర్తి అదుపు ఉండాల్సి ఉంటుంది. అందుకే రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ లైసెన్స్‌లు పొందిన వైన్స్, బార్లు మాత్రమే మద్యం అమ్మకాలకు అనుమతి ఇస్తోంది. అనధికారికంగా మద్యం అమ్మకాలు జరిపే బెల్ట్ దుకాణాలను యుద్ధ ప్రాతిపదికన గుర్తించి సీజ్ చేసి కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది. గత అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే జిల్లాలోని ఎక్సైజ్‌శాఖ అధికారులు బెల్ట్ దుకాణాలను మూసి వేయించారు. కానీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మాత్రం అలాంటి చర్యలేవీ తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా గతనెల 14న జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్‌శాఖ సీఐలు, ఎస్‌ఐలకు బదిలీలు జరిగాయి. తర్వాత లోకసభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో ఎన్నికల ప్రక్రియ కూడా వేగంగా ప్రారంభమైంది. కానీ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎక్సైజ్‌శాఖ అధికారులు కింది స్థాయిలోని సిబ్బందిని సమన్వయం

మిగతా 6వ పేజీలో..

అత్తారింట్లో అల్లుడి వీరంగం

- పెట్రోల్ పోసి ఇంట్లోని సామగ్రికి నిప్పు
- మామ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు
- పాల్వంచలోని ప్రియదర్శిని కాలనీలో ఘటన

పాల్వంచ, మార్చి 25: అత్తవారింట్లో ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. ఇంట్లోని సామగ్రిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో మామ ఫిర్యాదుతో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. భద్రాద్రి జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని ప్రియదర్శిని కాలనీకి చెందిన తూము రామారావు తన కూతురు శ్రీలక్ష్మిని 2008లో అదే ప్రాంతానికి చెందిన పెద్దిని రోశయ్యకు ఇచ్చి వివాహం చేశాడు. కొంతకాలం తరువాత భర్త రోశయ్య మద్యానికి బానిస కావడంతో అతడి ప్రవర్తనను భరించలేక శ్రీలక్ష్మి మూడేళ్ల నుంచి తన పుట్టింట్లో ఉంటోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి రోశయ్య తన అత్తవారింట్లో ఇంట్లోకి చొరబడి తన మామ రామారావు, భార్య శ్రీలక్ష్మిని దుర్భాషలాడుతూ ఇంట్లోని వస్తువులపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో రామారావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడినుంచి రోశయ్య పారిపోయాడు. రామారావు ఫిర్యాదు మేరకు రోశయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పాల్వంచ టౌన్ ఎస్‌ఐ బాణాల రాము తెలిపారు.

మనస్థాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మణుగూరుటౌన్, మార్చి 25: మణుగూరు పట్టణంలోని డబుల్‌బెడ్ రూం ఏరియాకు చెందిన ఇంటర్ విద్యార్థి యాప శ్రావణ్‌కుమార్ (17)సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం ఇంటర్ సెంకడియర్ చదువుతున్న శ్రావణ్‌కుమార్ అనారోగ్యంతో ఇటీవల ముగిసిన వార్షిక పరీక్షలు రాయలేకపోయాడు. దీంతో తనతోటి మిత్రులందరూ పరీక్షలు రాశారని, తాను మాత్రం రాయలేకపోయానని మనస్థాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రావణ్‌కుమార్ తల్లి రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మణుగూరు పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్‌పై యువకుల దాడి
- ఐదుగురిపై పోలీసులకు ఫిర్యాదు
- సత్తుపల్లిలో అర్బన్ పార్కు ఎదుట ఘటన

6

ప్రాణం తీసిన దండెం తీగ
- దుస్తులు ఆరేస్తుండగా విద్యుత్‌షాక్‌తో వివాహిత మృతి
- కొణిజర్ల మండలం సింగరాయపాలెంలో ఘటన

6

'బెల్ట్' మూసేదెవరు?

(ఐదవ పేజీ తరువాయి)

చేసుకొని బెల్ట్ దుకాణాల మూసివేతకు పూర్తిస్థాయిలో ముందుకు రావటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. ఈ క్రమంలో ప్రధాన రహదారులు, ముఖ్యమైన సమాచారం సేకరించి నగదు, ఇతర సామాగ్రిని సీజ్ చేయాల్సిన నియోజకవర్గస్థాయి



నిందితులను స్టేషన్‌కు తీసుకువచ్చిన వాహనాలు

ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ప్రామే ఎన్నికల ఫిర్యాదుల మేరకు వీధుల వెంట బెల్ట్ దుకాణాలపై దృష్టి సారిస్తున్నాయి. ఫ్లైయింగ్ స్క్వాడ్ పట్టుకున్న మద్యాన్ని, నిందితులను తీసుకెళ్లేందుకు కనీసం ఎక్సైజ్‌శాఖ అధికారులు రాకపోవటంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ వాహనాల ద్వారా ఆయాఅధికారులు నిందితులను, పట్టుబడ్డ మద్యాన్ని ఎక్సైజ్‌స్టేషన్‌లకు తరలిస్తున్నారు. బెల్ట్ దుకాణాల నిర్వాహకులు ఫ్లైయింగ్ స్క్వాడ్ వాహనాల్లో వచ్చేందుకు నిరాకరించటంతో వారికి అదనపు వాహనాలను సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇంత చేసి మద్యం, నిందితులను స్టేషన్‌కు తరలించిన తర్వాత ఎక్సైజ్‌శాఖ సిబ్బంది సహకరించకపోవటంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ జిల్లా అధికారులు సైతం ఎక్సైజ్ స్టేషన్‌ల వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పటిష్టమైన నిఘా కోసం ఏర్పాటు చేసిన ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు ఎక్సైజ్‌స్టేషన్‌లో ఉండటంతో ఆ స్క్వాడ్ లక్ష్యాలు నెరవేరటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఎన్నికల అధికారులు దృష్టి సారించి మద్యం బెల్ట్ తీసేవారెవ్వరో నిర్ణయించాల్సి ఉంది.

వాహనాల సంఖ్య తక్కువగా ఉంది..

● నాగేంద్రరెడ్డి, ఖమ్మం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్

బెల్ట్ దుకాణాలను మూసివేయించాల్సిన బాధ్యత ఎక్సైజ్‌శాఖ అధికారులపైనే ఉంటుంది. శాఖా పరంగా దాడులు నిర్వహించి బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేసి మూసి వేయిస్తున్నాం. మాకు వాహనాల సంఖ్య తక్కువగా ఉండటంతో ఎక్కువగా దాడులు జరగటం లేదు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తాం.

ప్రాణం తీసిన దండెం తీగ

● దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతంతో మహిళ మృతి

● కొణిజర్ల మండలం సింగరాయపాలెంలో ఘటన


గీత(ఫైల్ ఫొటో)

కొణిజర్ల, మార్చి25: దండెంపై తడి దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై వివాహిత మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సింగరాయపాలెం గ్రామానికి చెందిన సురభి రాజశేఖర్ భార్య గీత(30)తో కలిసి ఖమ్మంలో నివాసం ఉంటున్నాడు. హోలీ సందర్భంగా స్వగ్రామం సింగరాయపాలెం కుటుంబంతో కలిసి వచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఆమె దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మహిళలు....

తల్లాడ, మార్చి 25: ఒంటరితనం, అనారోగ్యం వల్ల మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..తల్లాడ మండలం బస్వాపురం గ్రామానికి చెందిన షేక్.రంజాన్‌బీ(41) అనారోగ్యం, ఒంటరితనంతో బాధపడుతూ మనస్తాపంతో ఈనెల 18న పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందింది. భర్త ఆరేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలుండగా వారి ఇరువురికి వివాహమై అత్తారిళ్లకు వెళ్లారు. ప్రస్తుతం ఆమె ఒంటరిగా ఉంటుంది. మృతురాలి తమ్ముడు నాగుల్‌మీరా ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.కొండల్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం క్రైం: కడుపునొప్పి తట్టుకోలేక నగరంలోని యూపీహెచ్ కాలనీకి చెందిన వివాహిత అంగోతు మంగమ్మ(35) అనే మహిళ ఈనెల 19న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమెను కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వ్యాపారి....


శంకరయ్య మృతదేహం

మణుగూరుటౌన్, మార్చి25: మణుగూరు పట్టణంలోని వ్యాపారి వీరముష్టి శంకరయ్య (82) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా, సర్జరీ చేయించుకున్నారు. మరోసారి తీవ్రంగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఓ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. శంకరయ్య మృతిపట్ల కిరాణ మర్చంట్స్ అసోసియేషన్‌తోపాటు వివిధ వ్యాపార, వాణిజ్య సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

వందనం పొలాల్లో పులి కలకలం

» కొట్టి పారేసిన ఫారెస్ట్ అధికారులు

» హైనా జాతికి చెందిన నక్కగా అధికారుల గుర్తింపు

చింతకాని, మార్చి 25: మొక్కజొన్న పొలంలో నీళ్ల కడుతున్న ఓ రైతు పులిగా భావించి భయపడి గ్రామంలోకి పరుగెత్తికొచ్చిన ఘటన మండల పరిధిలోని వందనం గ్రామంలో సోమవారం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వందనం గ్రామంలో పులి సంచారం అంటూ సోషల్ మీడియా గ్రూపుల్లో సోమవారం విస్తృతంగా చక్కర్లు కొట్టింది. గ్రామానికి చెందిన షేక్ గాలి సాహెబ్ అనే రైతు తన మొక్కజొన్న పొలానికి సోమవారం ఉదయం నీళ్లు కట్టేందుకు వెళ్లాడు. తన పొలం కొదుమూరు, వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో 40 ఎకరాల్లో విస్తరించి ఉన్న ప్రభుత్వ అటవీ భూమి సమీపంలో ఉండటంతో ఒంటిపై పులి మాదిరిగా మచ్చలు ఉన్న ఓ జంతువు తనకు సమీపంలోని పొదల చాటు నుంచి వెళ్తుండటంతో భయాందోళనకు గురై పులి అని భ్రమపడి గ్రామంలోకి పరుగెత్తికొచ్చి గ్రామస్థులతో పులిని చూశానంటూ తెలపడంతో గుంపులు గుంపులుగా ప్రజలు వెళ్లి పులి కోసం గాలించారు. సమాచారం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు ఘటన ప్రాంతానికి చేరుకుని రైతు చెప్పిన వివరాలతో పరిశీలించి పులి కాదంటూ విషయాన్ని కొట్టి పారేశారు. కేవలం 40 ఎకరాలు మాత్రమే ఉండి జన సంచారం ఎక్కువగా ఉన్న ఈ అటవీ భూముల్లో పులి ఉండదని, హైనా జాతికి చెందిన నక్కగా గుర్తించారు. రైతు భయాందోళనలో నక్కను చూసి పులి అని భ్రమపడ్డాడని ఫారెస్ట్ సెక్షన్ అధికారి వేణుమాధవ్ తెలిపారు.

నాయకన్‌గూడెం బీసీ గురుకులంలో సీసీ కెమేరాలు

ధ్వంసం చేసిన టెన్త్ విద్యార్థులు

● హాల్‌టికెట్లు ఇచ్చి ఇంటికి పంపిన ప్రిన్సిపాల్

కూసుమంచి, మార్చి 25: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలోని బీసీ గురుకుల పాఠశాలలో పలువురు పదో తరగతి విద్యార్థులు ఆదివారం రాత్రి పాఠశాలలోని సీసీ కెమేరాలు ధ్వంసం చేశారు. పరీక్షలు పూర్తయ్యాక ఇంటికి వెళతామనే అత్యుత్సాహంతో కొందరు విద్యార్థులు హాస్టల్‌లో గలాటా చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే గదుల్లోని సీసీ కెమేరాలు ధ్వంసం చేసినట్లు సమాచారం. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన ప్రిన్సిపాల్‌కు విద్యార్థులు సీసీ కెమేరాలు ధ్వంసం చేసినట్లు సిబ్బంది చెప్పడంతో వెంటనే సీసీ పుటేజీలో సదరు విద్యార్థులను గుర్తించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నలుగురు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చి ఇంటికి పంపినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. సదరు విద్యార్థులు ఇంటి నుంచే పరీక్షలు రాయాలని చెప్పినట్లు తెలిపారు.

శ్రీరామ కల్యాణ వేడుకలకు శ్రీకారం

తల్లాడ, మార్చి 25: తల్లాడ మండలం పినపాక గ్రామంలోని కోదండ రామాలయంలో శ్రీరామ కల్యాణ వేడుకలకు శ్రీకారం చుట్టారు. పౌర్ణమి సందర్భంగా సోమవారం స్వామివారికి పంచామృతాలు, చందనాభి అభిషేకాలు చేశారు. పసుపు కొట్టడం, వసంతోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు.


వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

శిథిలావస్థలో తాగునీటి పథకం

» దొంగలపాలవుతున్న రూ.లక్ష విలువైన పరికరాలు » వినియోగంలోకి తేవాలని గ్రామస్థుల వినతి » పట్టించుకోని అధికారులు

పెనుబల్లి, మార్చి 25: ఒకప్పుడు స్వచ్ఛమైన నీటిని పెనుబల్లి, వేంసూరు మండలాల్లోని 30గ్రామాల ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన మంచినీటి పథకం నేడు ఆలనాపాలనా లేక శిథిలావస్థకు చేరుకుంది. గతంలో పెనుబల్లి, వేంసూరు మండలాల్లోని కొన్ని గ్రామాల్లోని ప్రజలు ఫ్లోరైడ్ నీటితో బాధపడుతుండేవారు. నాటి పాలకులు కానీ ఈ పథకం ప్రారంభమైన తర్వాత ప్రజలు ఫ్లోరైడ్ బారీన పడకుండా జీవనం


ట్రాన్స్‌పార్మర్ చోరీకి గురికావడంతో మిగిలిన దిమ్మె

సాగించేవారు. పెనుబల్లి మండలం అడవిమల్లెల గ్రామంలో పెనుబల్లి, వేంసూరు మండలాల్లోని 30గ్రామాలకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు సమగ్ర ఫ్లోరైడ్ రహిత రక్షిత మంచినీటి పథకాన్ని 2002లో రూ.1.25కోట్లతో అప్పటి రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. నాటి నుంచి సుమారు దశాబ్దిన్నర కాలం పాటు పెనుబల్లి, వేంసూరు మండలాల్లోని 30గ్రామాల ప్రజలకు తాగునీటిని నిరంతరాయంగా సరఫరా చేసిన పథకం ఆతర్వాత కాలంలో అధికారులు పట్టించుకోకపోవడంతో మూలనపడింది. నాడు మంచినీటి పథకానికి గ్రామీణ ప్రాంతాల్లో చాలా ప్రాధాన్యత ఉండేది. దీని నిర్మాణం కోసం అడవిమల్లెల నుంచి 30గ్రామాలకు పైపులైన్లు వేసి లంకాసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని సేకరించి వాటిని క్లోరినేషన్ చేసి ప్రజలకు సరఫరా చేసేవారు. ఈ పథకం నడిచినంతకాలం ఆయా గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవు. పథకం శిథిలావస్థకు చేరి ప్రజలకు తాగనీటిని అందించకపోవడంతో మూలనపడింది. దీంతో ఎంతో విలువైన పరికరాలు దొంగలపాలవుతున్నాయి. ఇప్పటికే ఈ పథకం కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాలకు అమర్చిన విద్యుత్ తీగెలు చోరీకి గురికాగా ఇటీవల కాలంలో అడవిమల్లెల నుంచి రాజుగూడెం వరకు వేసిన ఐరన్ పైపులైన్లు కూడా చోరీకి గురవుతున్నాయి. ఈ పథకానికి సంబంధించి విలువైన వస్తువుల చోరీకి గురికావడం వెనుక ఆశాఖకు చెందిన కొందరి వ్యక్తుల హస్తముందని ఆరోపణలు సైతం ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో నీటి అవసరాలు పెరిగాయి. దీంతోపాటు లంకాసాగర్ ప్రాజెక్టు


శిథిలావస్థలో ఉన్న తాగునీటి పథక భవనం

లోనూ నీరు అడుగంటడంతో పశువులకు కూడా తాగునీరు లేక విలవిలలాడుతున్నాయి.

ఈ తరుణంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం లంకాసాగర్ ప్రాజెక్టును సాగర్‌జలాలతో నింపి ఈ పథకాన్ని పునరుద్ధరించి 30గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయాలని పెనుబల్లి, వేంసూరు మండలాల ప్రజలు కోరుతున్నారు.

పథకాన్ని పునరుద్ధరించాలి

● బెల్లంకొండ శ్రీనివాసరావు, రైతు



అడవిమల్లెల రక్షిత మంచినీటి పథకం పనిచేసినంతకాలం పశువులకు తాగునీటి ఇబ్బంది లేకుండా ఉంది. ప్రస్తుతం పథకం పనిచేయకపోవడంతో ఎండాకాలంలో తమ పశువులను తాగునీటి ఎద్దడి ఏర్పడింది. పథకాన్ని పునరుద్ధరించాలి.

విలువైన వస్తువులు దొంగలపాలవుతున్నాయి

● మల్లెంపాటి వేణుకుమార్, గ్రామస్థుడు



తాగునీటి పథకాన్ని కోట్ల రూపాయలతో నిర్మించారు. అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్, పైపులు దొం గలపాలవుతున్నా పట్టించుకోవడం లేదు. జిల్లా ఉన్న తాధికారులు దృష్టిసారించి పథకాన్ని పునరుద్ధరించి తాగునీటిని నిరంతరాయంగా సరఫరా చేయాలి.

శ్రీరామభక్తులకు మజ్జిగ పంపిణీ

కొత్తగూడెం సాంస్కృతికం, మార్చి25: ఇండిన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ ఉమెన్స్ గిల్డ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం శ్రీరామ భక్తులకు సేవా కార్యక్రమం నిర్వహించారు. కొత్తగూడెంలోని శ్రీ విజయవిఘ్నేశ్వరస్వామి దేవాలయం నుంచి శ్రీరామనవమి సందర్భంగా గోటి తలంబ్రాలు తీసుకుని భద్రాచలం వెళ్లే భక్తులకు ఇండియన్ స్కౌట్స్‌అండ్ గైడ్స్ ఉమెన్స్ గిల్డ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో సింగరేణి గెస్ట్‌హౌస్ సమీపంలోని పోచమ్మగుడి వద్ద మజ్జిగ ప్యాకెట్లు, పండ్లును పంపిణీ చేశారు. మత సామరస్యం తెలియచేసే విధంగా తొలిసారిగా ఉమెన్స్ గిల్డ్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎస్‌జీఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాసీలం ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ఉమెన్స్ గిల్డ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ నూరి మెహరున్నీసా, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. శ్వేతా, కోశాధికారి సోనా, జిల్లా ముఖ్య సలహాదారులు ఐసీడీఎస్, సీడీపీవో కనకదుర్గ, ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, ఉమెన్స్ గిల్డ్ ముఖ్య సలహాదారు జ్యోతిరాణి, ఎస్‌జీఎఫ్ కల్చరల్


భక్తులకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

విభాగం కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, ముఖ్య ప్రతినిధులు విజయ్‌కుమార్, జానకీ, కల్యాణి, బొడ్డు కవిత, ఉమా, అంజమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో

ముగ్గురిని కాపాడిన కానిస్టేబుళ్లు


నదిలో మునిగిపోతున్న యువకులు


కానిస్టేబుళ్లు కాపాడిన యువకులు

మణుగూరు , మార్చి 25: గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవ శాత్తు నీటిలో మునకకు గురవుతూ ప్రాణప్రాయ స్థితికి చేరుకున్న ముగ్గురు యువకులను ఇద్దరు కానిస్టేబుళ్లు ధైర్య సాహసాలతో కాపాడిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపన వివరాల ప్రకారం.. మణుగూరు మండల పరిధిలోని సమితి సింగారం గ్రామానికి చెందిన ఎనిమిది మంది మిత్రులు హోలీ పండుగను జరుపుకొని, స్నానానికి కొండాయిగూడెం గ్రామంలోని గోదావరి నదికి చేరుకున్నారు. వీరిలో నలుగురు ఓ చోట, మరో నలుగురు మరో చోట స్నానం చేసేందుకు నదిలో దిగారు. నదిలోతు అంచనా లేని వీరు ముందుకు వెళ్లడం ఆరంభించారు. ఇందులో మహేష్, కిలారు నాగరాజు, అశోక్ ప్రభాకర్‌తో పాటు మరోకరు కాస్త దూరం వెళ్లారు. ఈ క్రమంలో లోతు తెలియని మహేష్ నీటిలో మునగడం మిత్రులు గమనించారు. అతడిరి కాపాడేందుకు మిత్రులు ఒకరితో పాటు మరొకరు ఇలా ముగ్గురు ప్రమాదవ శాత్తు మునకకు గురయ్యారు. ఈ క్రమంలో యువకులు కేకలు వేయడంతో స్థానికంగా విధులు నిర్వహిస్తున్న వినయ్, సనై అనే కానిస్టేబుళ్లు ప్రమాదాన్ని గమనించి హుటాహుటిన గోదావరిలో దిగి మునిగిపోతున్న ముగ్గురిని కాపాడారు. వారిని ఒడ్డుకు చేర్చారు. వీరిలో మహేష్ స్పృహ కోల్పోవడంతో అతనికి సీపీఆర్, ప్రాథమిక చికిత్సలు చేసి కాపాడారు. అదృష్టవ శాత్తు అంతా సురక్షితంగా బయట పడ్డారు. కానిస్టేబుళ్లు చూపిన ధైర్య సాహసాలతో ముగ్గురిని కాపాడిన తీరుపై స్థానికులతో పాటు మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ సతీష్ కుమార్‌లు ప్రత్యేకంగా అభినందించారు.


యువకులను కాపాడిన కానిస్టేబుళ్లు వినయ్, సనై

'టెట్ దరఖాస్తు ఫీజును తగ్గించాలి'

ఖమ్మం ఖానాపురంహవేలీ మార్చి 25: తెలంగాణ ప్రభుత్వం టెట్ దరఖాస్తుల ఫీజును తగ్గించాలని తెలంగాణ ప్రైవేటు టీచర్స్ ఫోరం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో టెట్ దరఖాస్తు ఫీజు ఒక పేపర్‌కు రూ.300 వందలు, రెండు పేపర్లకు రూ.400 వందలు ఉండేదని, ఇందులో ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రాయితీ ఉండేదని అన్నారు. ప్రస్తుత టెట్ నోటిఫికేషన్‌లో ఒక పేపర్‌కు రూ.1000, రెండు పేపర్లకు రూ. 2000 గా పేర్కొన్నారని, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఎలాంటి రాయితీలేకుండా చేశారని ఆరోపించారు. దీంతో ఎంతో మందికి ఆర్థికంగా అభ్యర్థులపై పెను భారం పడుతుందని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే పెంచిన ఫీజు భారాన్ని తగ్గించాలని కోరారు.

ఆసుపత్రి యాజమాన్యంపై కేసు

ఖమ్మం క్రైం, మార్చి 25: నగరంలోని ఓ ఆసుపత్రి యాజమాన్యంపై ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్ నందు సోమవారం రాత్రి కేసు నమోదైంది. నగరంలోని వైరారోడ్‌లో ఉన్న ఓ ఆసుపత్రిలో వైద్యులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నర్సులతో అబార్షన్లు చేస్తున్నారన్న సమాచారం రావడంతో ఖమ్మం టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా సోమవారం ఆస్పత్రిపై దాడులు నిర్వహించారు. ఆసుపత్రికి సంబంధించిన పలు డాక్యుమెంట్లు తనిఖీ చేశారు. ఈ తనిఖీల అనంతరం ఆసుపత్రి యాజమాన్యంపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బీఆర్ఎస్ కౌన్సిలర్‌పై యువకుల దాడి

● ఐదుగురిపై పోలీసులకు ఫిర్యాదు

సత్తుపల్లిరూరల్, మార్చి25: సత్తుపల్లి మునిసిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్‌పై కొందరు యువకులు దాడిచేసిన సంఘటన సోమవారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు మునిసిపాలిటీలోని 8వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కే.చాంద్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం ఎన్టీఆర్ నగర్‌లోని బైక్ షెడ్ మూసివేసి ఇంటికి వెళ్తుండగా వేంసూర్ రోడ్డులోని అర్బన్ పార్క్ ఎదుటనున్న పెట్రోల్ బంక్ వద్ద కొందరు యువకులు తనపై దాడికి దిగారని తెలిపారు. తనను తీవ్రంగా గాయపరిచి దుర్భషలాడుతూ చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనపై దాడిచేసిన ఐదుగురు యువకులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కౌన్సిలర్ చాంద్‌పాషాను మునిసిపల్ ఛైర్‌పర్సన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్ అద్దంకి అనిల్, నాయకులు ఎస్‌కే.రఫీ, వల్లభనేని పవన్, మదీనాపాషా, జిన్నీలు పరామర్శించారు.

ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కృషి చేయాలి

● ఏఐఎస్ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు రామకృష్ణ, ప్రవీణ్



జెండాలతో హర్షం వ్యక్తం చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 25: ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు వామపక్ష విద్యార్థి సంఘాలు పోరాటాలు చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు ఇటికాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్‌లు అ న్నారు. సోమవారం ఖమ్మంలో భారతదేశంలోనే అత్యున్నత యూనివర్సిటైనా జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో వామపక్ష విద్యార్థి సంఘాలు విజయం సాధించటంపై హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల జెండాలను ప్రదర్శించి హర్షం వ్యక్తం చేశారు. బాణాసంచాలను కాల్చి నినాదాలు చేస్తూ సం తోషం ప్రకటించారు. నాయకులు సందీప్, రాజు, పవన్, మనోజ్, ప్రసన్న పాల్గొన్నారు.

టీటీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం రేపు

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 25: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నగరంలోని నీక్వెల్ రిసార్ట్స్ నందు నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి ఓలేటి సాంబమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతన ఎక్జిక్యూటివ్ కమిటీ ఎన్నికతో పాటు రాబోయే సమ్మర్ క్యాంప్ నిర్వహణ, భవిష్యత్‌లో టోర్నమెంట్ల నిర్వహణపై ప్రణాళికలు నిర్ణయించనున్నట్లు ఆయన తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎర్రుపాలెం, మార్చి 25: మండల కేంద్రంలోని ఎర్రుపాలెం రైల్వే స్టేషన్‌లో రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫార్మ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(30) దిగువ మెయిన్ లైన్ రైలు పట్టాలను దాటుతుండగా విజయవాడ వెళ్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదవశాత్తు ఢీ కొనగా మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని ఖమ్మం పట్టణానికి చెందిన అన్నంసేవా ఫౌండేషన్ నిర్వాహకులు అన్నం శ్రీనివాసరావు, వాలంటీర్ల సహాయం తో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి భద్రపరిచారు. మధిర జీఆర్పీ అవుట్‌పోస్ట్ ఇన్‌చార్జి వేణుగోపాల్ రెడ్డి, కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


ఇసుక ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

ముదిగొండ, మార్చి 25: మండలంలోని పెద్దమండవ మున్నేరు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం ముదిగొండ పోలీసులు సువర్ణాపురం వద్ద పట్టుకున్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంపై ఎస్ఐ నరేష్ సిబ్బందితో దాడులు చేసి ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్ల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మం ఖానాపురంహవేలి మార్చి 25: ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉన్న మూడు అనాథ మృతదేహాలకు సోమవారం నగరంలోని అన్నం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఐదు రోజుల క్రితం ఖమ్మం రైల్వే పోలీసు పరిధిలో రైలు ఢీకొని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి చెందారు. డోర్నకల్ రైల్వే పోలీసుల పరిధిలో మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. ఈ మూడు మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఈ మృతదేహల కోసం ఎవ్వరు రాకపోవడంతో రైల్వే పోలీసులు, ఆసుపత్రి సిబ్బంది సమక్షంలో మార్చురీలో ఉన్న మృతదేహలను స్వాధీనపర్చుకోని అన్నం సేవా ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం సేవా సభ్యులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డుకి మోక్షం ఎన్నడో..?

» శిథిలావస్థకు చేరిన రెబ్బవరం-నెమలి రహదారి » ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

వైరా, మార్చి 25: రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేసే రెబ్బవరం వయా గన్నవరం, నెమలి వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం అతీగతీ లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్‌అండ్‌బీశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు ఉన్న సమయంలో డబుల్‌రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇది జరిగిన ఏడెనిమిదేళ్లు అవుతున్నా ఇంతవరకు ఎలాంటి కదలిక లేదు. వైరా-మధిర, జగ్గయ్యపేట ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో ఉన్న రెబ్బవరం నుంచి కొండకొడిమ క్రాస్‌రోడ్డు, ఖానాపురం, గన్నవరం, దాచాపురం క్రాస్‌రోడ్డు మీదుగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలికి రోడ్డు వెళ్తుంది. రెబ్బవరం నుంచి నెమలికి 11కిలోమీటర్ల దూరం సింగిల్‌రోడ్డుగా ఉంది. సింగిల్‌రోడ్డును కాస్తా డబుల్ రోడ్డుగా నిర్మించేందుకు రూ.12కోట్లు నిధులు మంజూరు చేయాలని ఆర్‌అండ్‌బీ మం త్రి హోదాలో తుమ్మల నాగేశ్వరరావు ఏడెనిమిదేళ్ల కిందట జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదనలు అందజేశారు. ఆయన హయాంలోనే ఈ రోడ్డుకు మహర్థశ పడుతుందని అందరూ ఆశించారు. అయితే తుమ్మల అందజేసిన ప్రతిపాదనలకు కేంద్రం నుంచి మోక్షం లభించలేదు. 2018లో జరిగిన ఎన్నికల్లో తిరిగి రెండోసారి బీఆర్ఎస్ అధికారంలోకి


శిథిలావస్థలో ఉన్న కల్వర్టు


రెబ్బవరం-ఖానాపురం మధ్య అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

వచ్చినప్పటికీ తుమ్మల ఓడిపోవడంతో ఈ రోడ్డు గురించి పట్టించుకొనే వారే లేరు. ఈ రోడ్డులో కొండకొడిమ క్రాస్‌రోడ్డు-ఖానాపురం మధ్య వైరా కుడికాల్వపై నిజాం నవాబు హయాంలో కాల్వల నిర్మాణ సమయంలో వందేళ్ల కిందట నిర్మించిన కాజ్‌వే పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు చెందిన టిప్పర్లు, భారీ వాహనాలు అధిక బరువుతో ఈరోడ్డుపైన తిరుగుతుండటంతో ఈ కల్వర్టు ఎప్పుడు కూలిపోతుందో కూడా తెలియని ప్రమాదకర పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఖానాపురం-గన్నవరం మధ్య రోడ్డు మొత్తం ధ్వంసమైంది. సింగిల్ రోడ్డును డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేస్తే రెండు తెలుగు రాష్ట్రాలకు కీలకమైన రహదారిగా మారుతుంది. ఇదే మండలానికి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చొరవ తీసుకొని కేంద్రప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలకు నిధులు సాధించి డబుల్‌రోడ్డుగా అభివృద్ధి చేయాలని ఈరూటు ప్రజలు కోరుతున్నారు.





రంగులు పూసుకుంటున్న చిన్నారులు



హోలీ వేడుకల్లో సీపీ దంపతులు



సిబ్బందితో కలిసి నృత్యం చేస్తున్న సీపీ



హోలీ కేళి..

ఇరుజిల్లాల్లో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున కాముని దహనాలు నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పలుచోట్ల సామూహికంగా వేడుకలు జరుపుకొన్నారు.



లోక్యాతండాలో కామదహన వేడుకలు

లోక్యాతండాలో రెండోరోజూ వేడుకలు

కూసుమంచి, మార్చి 25: మండలంలోని లోక్యా తండలో రెండోరోజైన శనివారం హోలీ వేడుకలు సంప్రదాయబద్ధంగా కొనసాగాయి. తెల్లవారుజామున 4గంటలకు తండాలో కామదహనం నిర్వహించారు. ప్రతి ఇంటినుంచి కర్రలను తీసుకొచ్చి శివారులో పేర్చి కామదహనం నిర్వహించారు. యువకులు, మహిళలు, వృద్ధులు, చిన్నారులు మంటల చుట్టూ తిరిగి పాటలతో కేరింతలు కొట్టారు. అనంతరం బూడిదను నుదిట దిద్దుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జర్పుల బాలాజీనాయక్, మాజీ జడ్పీటీసీ రామచంద్రునాయక్, వడిత్య సేట్‌రాం, మాజీసర్పంచ్ సుశీల, గ్రామపెద్దలు గేరియా సామ పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా డూండ్

లోక్యాతండాలో హోలీని పురస్కరించుకుని డూండ్ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా జరుపుకొన్నారు. గత హోలీ తెల్లారినుంచి ఈ హోలీవరకు ఏడాది కాలంలో తండాలో మగబిడ్డపుట్టిన ఇళ్లలో ఈ తంతును జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గేరియాగా వ్యవహరిస్తున్న వడిత్య సామనాయక్ క్యార్యక్రమాన్ని ప్రాంభించారు. అనంతరం బిడ్డలకు నామకరణం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులంతా పాల్గొన్నారు.



దమ్మపేటలో హోలీ వేడుకలు



భద్రాద్రిలో..



లోక్యాతండాలో డూండ్ వేడుక



రామాలయంలో గోటితో తలంబ్రాలు తీసుకొచ్చిన మహిళలు

రామయ్య కల్యాణ పనులు షురూ

వసంతోత్సవంతో ప్రారంభమైన క్రతువు

భద్రాద్రి రామాలయంలో సోమవారం స్వామివారికి వసంతోత్సవం, డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. హోలీ సందర్భంగా రామయ్యకు వసంతం చల్లడంతో పెళ్లికొడుకును చేసినట్టుగా భావిస్తారు. అదేవిధంగా పసుపుకొట్టి, తలంబ్రాలను కలిపారు. దీంతో కల్యాణంలో ముఖ్య ఘట్టం ప్రారంభమైంది.



రామయ్య కల్యాణంకు తలంబ్రాలను కలుపుతున్న వైదిక సిబ్బంది



తలంబ్రాలు కలిపే కార్యక్రమంలో భక్తులు

కన్నుల పండువగా జ్వాలా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

కరకగూడెం, మార్చి25: బుర్దారం కారడవీలో వెలసిన సువర్ణగిరి జ్వాలా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణాన్ని సోమవారం పూజారులు ములుగు జిల్లా, మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పూజారి నరసింహ మూర్తి, బుర్దారం ఆలయ అర్చకులు పోలెబోయిన రవితేజ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు పోలెబోయిన వంశీయులు పోలెబోయిన శంకర్ కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ వంశీయులు, ధర్మకర్త పోలెబోయిన రవితేజ ఆధ్వర్యంలో నిర్వహించారు. 26న స్వామి ఊరేగింపు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.



జ్వాలా లక్ష్మీనరసింహ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 25: ఖమ్మం జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగులకు నిర్వహించనున్న శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 100 మంది నిరుద్యోగులకు 3నెలల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు, గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షల కోసం ఎంపిక చేసిన 100 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం రూపొందించామని ప్రకటించారు. ఈనెల 26నుంచి జూన్ 25 వరకు శిక్షణా కార్యక్రమం ఎస్సీ స్టడి సర్కిల్‌లో నిర్వహించటం జరుగుతుందని పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ నిరుద్యోగులు తమ విద్యార్హత పత్రాలు, రెండు ఫొటోలు తీసుకొని ఈనెల 28న ఉదయం 10గంటలకు రాపర్తినగర్‌లోని, టీఎన్జీవోస్ కాలనీ, రోడ్డు నెంబర్ 9, ఎస్సీ స్టడి సర్కిల్ కార్యాలయానికి రావాలని సూచించారు. వంద మంది విద్యార్థులకు మించి వస్తే మార్కులు ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. పూర్తిస్థాయి సమాచారం కోసం 98484 94290 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రీడా పాఠశాలల ఫైనల్ ఎంపికలు నేడు

పాల్వంచ రూరల్, మార్చి25: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5,6 తేదీల్లో నిర్వహించిన క్రీడా పాఠశాలల ఫైనల్ ఎంపికలను మంగళ, బుధవారాల్లో కిన్నెరసాని, క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు క్రీడల అధికారి బొల్లి గోపాల్‌రావు, సహాయ క్రీడల అధికారి కొమరం వెంకట నారాయణలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బ్యాటరీ టెస్ట్‌లో ఎంపికైన విద్యార్థులు కిన్నెరసాని క్రీడా ప్రాంగణంలో హాజరుకావాలన్నారు. బాలుర ఇన్‌చార్జి పీడీ బుగ్గ వెంకటేశ్వర్లు, బాలికల ఇన్‌చార్జి అన్నం వెంకటేశ్వర్లు, ఆర్చరీ కోచ్ పద్దం రాంబాబు, అథ్లెటిక్ కోచ్ నాగరాజుల 96185 15907, 99123 62053, 96521 41831, 79891 08234 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.





రైతు మిత్రులు

» మిత్ర పురుగులతో పంటకు మేలు » ఆరోగ్య ఆహార ఉత్పత్తులు

ఖమ్మం వ్యవసాయం, మార్చి 25: పంటల సస్యరక్షణలో మిత్ర పురుగుల పాత్ర ఎంతో కీలకం.వీటితో పంటలకు మేలు చేకూరుతుందని, ఇవి చీడపీడల నుంచి రక్షణ కల్పిస్తాయి. ఈ పురుగుల గురించి రైతులు తెలుసుకుంటే క్రిమి సంహారక మందులు వాడే బెడద ఉండదు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను పొందవచ్చు.

పరాన్న జీవులు మూడు దశల్లో ఆశించి పురుగులను నాశనం చేస్తాయి. గుడ్ల దశలో ట్రైకోగామా ఖిలోనిస్, ట్రైకోగామా జపానికం, టెలినోమస్, లార్వా దశలో ఆపాంటిలిస్, టెమిలుక, ఇలాస్మస్, కోశస్థ దశలో జంథోపింప్లా, బ్రాచిమెరియా, గోనియాజస్ మొదలైనవి ఉంటాయి. ట్రైకోగామా, టెలినోమస్, టెట్రానికస్ జాతికి చెందినవి గుడ్డు దశలో పరాన్నజీవులు, కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగులు పెట్టిన గుడ్లను ఆశిస్తాయి. గుడ్డు దశలోనే 50 శాతం వరకు కాండం తొలుచు పురుగుల ఉధృతిని తగ్గిస్తాయి. ట్రైకోగామా పురుగులను పొలంలోనే కృత్రిమంగా విడుదల చేసి అతి తక్కువ ఖర్చుతో శత్రు పురుగుల సంఖ్య పెరగకుండా నియంత్రించ వచ్చు.

రైతులకు మేలు ఇలా..

దాదాపు ఇరవై వేల గుడ్లు ఉన్న ట్రైకోకార్డును ఎనిమిది లేదా పదహారు సమభాగాలుగా చేసి ఎకరా పొలంలో అక్కడక్కడా ఎండ తగలకుండా ఆకు అడుగు భాగంలో పిన్ చేయాలి. ఈ విధంగా ట్రైకో కార్డులను వాడే వారం రోజుల ముందు, తర్వాత వారం రోజుల వరకు ఎలాంటి రసాయన మందులు పిచికారీ చేయకూడదు. వరినాట్లు వేసిన వారం రోజుల తర్వాత పది రోజుల వ్యవధిలో మూడు లేదా నాలుగు సార్లు వదిలితే కాండం తొలుచు పురుగులను నివారించవచ్చు.



టెమిలుక, ఫినోరోటామా జాతికి చెందిన పరాన్న జీవులు కూడా కాండం తొలుచు పురుగులను లార్వాను, కొశస్థ దశలను చంపివేస్తాయి. పరాన్న జీవులు లేదా బదనికలుగా ఎనిమిది రకాల సాలే పురుగులు వరి పంటపై నివశిస్తాయి. ఇవి అనేక ఆకృతులు, రంగుల్లో ఉంటాయి. ఇవి సుడిదోమలు, తెల్లమచ్చ దోమలు, పచ్చదీపపు పురుగులు, ఆకుముడత, గొట్టపురుగులను తింటాయి. నీటి నల్లులు నీటిలో నివశిస్తాయి. ఇవి సుడిదోమలు, దీపపు పురుగులను తింటాయి. మిరిడ్ నల్లులు లేత ఆకుపచ్చ రంగులో పొడవైన స్పర్శకాలను కలిగి ఉంటాయి. ఇవి సుడిదోమలు, దీపపు పురుగులను తింటాయి. పెంకు పురుగులు వివిధ రకాల లద్దె పురుగులు, కాండం తొలుచు పురుగులను తింటాయి. వాటర్ స్పైడర్స్ నీటిపైన తేలియాడుతూ సుడిదోమ, చిన్న గొంగళి పురుగులను తింటాయి.

గొల్లభామలు రైతులకు బాగా ఉపయోగపడతాయి. రసం పీల్చే పురుగులు, ఇతర చీడ పురుగులను తింటాయి. తూనీగలు సుడిదోమలు, దీపపు పురుగులు, గొట్టపు పురుగులను తింటాయి. అల్లిక రెక్కల పురుగులు పేనుబంక, తెల్లదోమ, పచ్చదోమ, తొలి దశలో ఉన్న లద్దె పురుగులను తింటాయి. చీడ పీడల ఉధృతి ఎక్కువగా ఉంటే మాత్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సిఫారసు మేరకు రసాయన మందులను పిచికారి చేయాలి.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

అన్నపురెడ్డిపల్లి, మార్చి 25: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి అన్నపురెడ్డిపల్లిలో బాలాజీ వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణమహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం గ్రామ పురవీధుల గుండా చేపట్టారు. అనంతరం స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఆలయ మేనేజర్ పాకాల వెంకటరమణ పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జులురుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



పసుపు కొడుతున్న అర్చకులు



ఆలయంలో పోటెత్తిన భక్తులు



తలంబ్రాలు కలుపుతున్న భక్తులు

కిషన్‌రెడ్డిని కలిసిన తాండ్ర వినోదరావు

ఖమ్మం బైపాస్‌రోడ్, మార్చి 25: బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా తాండ్ర వినోదరావును ప్రకటించడంతో సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావులను తాండ్ర వినోదరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మోదీ ప్రభంజనం ఉందని, ఖమ్మంలో ఘనవిజయంతో బీజేపీ గెలవబోతుందని ఆయన అన్నారు. ప్రజలకు విస్తృతసేవలు చేసేలా తనకు ఎన్నికల్లో పాల్గొనే అవకాశం కల్పించినందుకు పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వినోదరావు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

విద్యుత్ సరఫరాలో అంతరాయం

» మధిరలో హై, లో వోల్టేజీ సమస్యలతో కాలిపోతున్న టీవీలు, ఫ్రిజ్‌లు

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు

» సమస్యను పరిష్కరించాలని వినతి


మధిర, మార్చి 25: అసలే ఎండా కాలం. ఎండలు మండిపోతున్నాయి. ఈ సమయంలో కరెంటు కూడా లేకపోతే ఇక పరిస్థితి వర్ణనాతీతం. పెద్దలు, పిల్లలు ఉక్కపోతతో ఇబ్బందులు పడాల్సిందే. మధిరలో ఇటీవల తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ప్రజలు అలాంటి ఇబ్బందులేపడుతున్నారు. ఒక వైపు మరమ్మతుల పేరుతో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో కరెంట్ నిలిపివేస్తున్నారు. అదీ చాలదన్నట్లు కొన్ని ప్రాంతాల్లో లో వోల్టేజీ, లేదా హై వోల్టేజీ సమస్యలతో ఇబ్బందులుపడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఆదివారం సాయంత్రం మధిర టుటౌన్‌లోని రాజీవ్ నగర్, ఆర్‌సీఎం చర్చి ఏరియా ప్రాంతాల్లో ఒక్కసారిగా హైవోల్టేజీ వచ్చి పలువురి టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయని స్థానికులు వాపోతున్నారు. ఇలాంటి సమస్య ఇటీవల రూర్ గ్రామాల్లోనూ ఏర్పడింది. ఈవిషయమై విద్యుత్ శాఖ వారికి ఫిర్యాదు చేసిన స్పందన లేదని ఆరోపిస్తున్నారు. సోమవారం ఉదయం వరకు తాము కరెంట్ సమస్యతో ఇబ్బందులు పడ్డామని వాపోయారు.

ఇలా ఏదో ఒక ప్రాంతంలో సమస్య ఉంటూనే ఉందని, అధికారులను అడగగా అదేమంటే మరమ్మతులంటున్నారని తెలిపారు. ఇలా తరచూ మరమ్మతులు చేయడం కాకుండా, శాశ్వత పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ అనిల్ కుమార్ కోరగా..రాజీవ్ నగర్ కాలనీలో స్థానిక ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏర్పడిన సమస్య వల్ల హైవోల్టేజీ వచ్చిందని, వెంటనే సోమవారం మరమ్మతులు చేపట్టి కరెంట్ పునరుద్ధరించామన్నారు. అలాగే వన్‌టౌన్‌లోనూ విద్యుత్ లైన్ల మధ్య ఏర్పడిన సాంకేతిక సమస్యను గుర్తించి పరిష్కరించినట్లు తెలిపారు.

పర్ణశాల రామాలయంలో వసంతోత్సవం

దుమ్ముగూడెం, మార్చి 25: భద్రాచల సీతారామచంద్రస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయంలో సోమవారం డోలోత్సవం, వసంతోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, లక్ష్మీపూజలను నిర్వహించారు. ముత్తయిదువులచే తయారు చేయించిన పసుపు చూర్ణాన్ని మూలమూర్తులు, ఉత్సవమూర్తులకు సమర్పించారు. స్వామివారికి వినియోగించే ద్రవ్యాలతో వసంతం తయారు చేసి సంప్రోక్షణ నిర్వహించారు. మూలవర్ల అభిషేక ఉత్సవ స్నాపనం, శ్రీరామచంద్రస్వామిని పెళ్లికొడుకుగా అలంకరించారు. సాయంత్రం తిరువారాధన, తిరువీధి సేవ, విశేష ప్రసాద నివేదన, భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణలను నిర్వహించారు. ముఖ్య అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, పొడిచేటి రామభద్రాచార్యులు, నరసింహాచార్యులు, ఆలయ ఇంచార్జి ప్రసాదు, ఫెస్టివల్ అధికారి అనీల్‌కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

మంగళవారం 26 మార్చి 2024

ఆనందోత్సాహాల మధ్య హోలీ

జిల్లా వ్యాప్తంగా రంగుల పండుగ

ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు, యువత

కామదహనంతో ప్రారంభమైన వేడుకలు

హోలీ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు, యువత కేరింతలు కొడుతూ... వేడుకల్లో పాల్గొన్నారు. ఆదివారం రాత్రి కామదహనంతో ప్రారంభమైన వేడుకలు సోమవారం కొనసాగాయి. పిల్లా, పెద్దా ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.



మణుగూరులో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



చిన్నారుల సందడి



చండ్రుగొండలో



దుమ్ముగూడెంలో...



భద్రాచలంలో కోలాటం ఆడుతున్న మహిళలు



కలెక్టర్ కార్యాలయంలో వేడుకలు



కొత్తగూడెంలో యువత ఉత్సాహం



అశ్వారావుపేటలో యువతుల ఉత్సాహం



జూలూరుపాడులో



హోలీ వేడుకల్లో డీసీఎంఎస్ చైర్మన్



వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ రోహిత్ రాజు

భక్తి ప్రపత్తులతో వేణుగోపాలస్వామి కల్యాణం

బూర్గంపాడు, మార్చి 25: బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండి గ్రామంలో వేంచేసి ఉన్న సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవాం తిరుకళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. రుక్మిణి సత్యభామ సమేతుడైన వేణుగోపాలస్వామి కళ్యాణాన్ని వైష్ణవ సంప్రదాయం ప్రకారం అర్చకులు కాకరాల శర్మ కనులు పండుగగా జరిపారు. కళ్యాణాన్ని పురస్కరించుకుని ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో అర్చకులు కళ్యాణాన్ని నిర్వహించగా భక్తులు తిలకించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఆలయ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య కుమార్తె, ప్రవాస భారతీయురాలు అనితరాణి-ప్రవీణ్ కుమార్ దంపతులు, మాజీ ఎంపీటీసీ వల్లూరిపల్లి వంశీకృష్ణ-విజయరేణుక దంపతులు పీటలపై కూర్చొని కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, జడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ భిక్కసాని శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి పాల్గొన్నారు.



ఇరవెండిలో కల్యాణ దృశ్యం

టేకులగుట్టలో..

అశ్వాపురం: కాముని దహనం అనంతరం మండల పరిధిలోని అశ్వాపురం మండలం టేకులగుట్ట ఆలయంలో సోమవారం సంతాన వేణుగోపాల స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య మంగళవాయిద్యాలతో రాధా, కృష్ణుల కల్యాణాన్ని కన్నుల పండుగగా జరిపించారు. ఈ కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హజరై స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ సుజాత, నెల్లిపాక ఎంపీటీసీ జయ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవుని కల్యాణం

భక్తుల రద్దీతో కిటకిటలాడిన కల్యాణ ప్రాంగణం

శాస్త్రోక్తంగా క్రతువు నిర్వహించిన అర్చకులు

కనులారా వీక్షించి తరించిన భక్తజనం

సుజాతనగర్, మార్చి 25: హోలీ పండుగ పర్వదినాన సుజాతనగర్ మండల కేంద్రంలోని కొండపై కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు కె. సత్యన్నారాయణాచార్యులచే సోమవారం ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఎంతో ప్రాచుర్యం కలిగిన ఈ స్వామివారి కల్యాణాన్ని తిలకించడానికి మండలంలోని చుట్టు ప్రక్కల గ్రామాల నుంచే కాకుండా హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఈ కల్యాణ క్రతువును వీక్షించడానికి వస్తూ ఉండటం పరిపాటి. ఈ కల్యాణ మహోత్సవ వేడుకల కోసం ప్రత్యేకంగా వేసిన షామియానాలతో, చలువ పందిళ్ల మండపంలో శాస్త్రయుక్తంగా, రుత్వికుల వేద మంత్రోచ్చారణల మధ్య స్వస్తిశ్రీ చాంద్రమానేన శోభకృత్ నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సోమవారం మధ్యాహ్నం 12.30 నిమిషాలకి పెండ్లి కుమారుడైన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ చెన్నకేశవ స్వామి, పెండ్లి కుమార్తెలైన అఖిలాండకోటి జగన్మాతలైన శ్రీదేవి, భూదేవిలతో కన్నుల పండుగగా కళ్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కళ్యాన్ని కనులారా వీక్షించి, తరించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. మేళతాళాలతో, డప్పు వాయిద్యాల నడుమ సాయంకాలం పుర వీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు.



కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

క్రీడా పోటీల ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ

దుమ్ముగూడెం, మార్చి 25: కాటురం యూత్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో జిన్నెలగూడెంలో నిర్వహిస్తున్న నాలుగు మండలాల స్థాయి క్రికెట్ పోటీలను ఎంపీపీ రేసు లక్ష్మి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి సోమవారం ప్రారంభించారు. గెలుపు ఓటములను హుందాగా స్వీకరించాలని కోరారు. ఎండవేడిమి దృష్ట్యా క్రీడాకారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాయకులు కామేష్, శ్రీను, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

పాల్వంచ టౌన్, మార్చి 25: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, పాల్వంచ కోఆపరేటివ్ మాజీ వైస్‌చైర్మన్ వంకాయలపాటి మురళీ కృష్ణ (58) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సోమవారం ఆయన మృతదేహాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావుతోపాటు పలువురు ప్రముఖులు సందర్శించి మృతదేహంపై కాంగ్రెస్ కండువా కప్పి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు తమ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి వంకాయలపాటి చేసిన సేవలను కొనియాడారు. పట్టణ ప్రముఖులు, పలువురు పట్టణ వైద్యులు, మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలు పార్టీల నాయకులు, కమ్మసేవా సంఘం నాయకులు, పలువురు వంకాయలపాటి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పేదలకు సేవ చేయడమే ఆనందం



బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

కరకగూడెం, మార్చి 25: నేటి సమాజంలో నిరు పేదలకు సాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్ సభ్యులు షేక్ సోందుపాషా అన్నారు. సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలకు చెందిన 50 పేద కుటుంబాలకు 20 కేజీల చొప్పున పది క్వింటాల బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

కరకగూడెం, మార్చి 25: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అంగరంగ వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకుడు ఈశ్వరయ్య శివగురుస్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి ధ్వజ స్థంబం, హోమాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి పూజారులు మధ్యాహ్నం 12.30నిమిషలకు వెంకటేశ్వర స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పూజారి రమేష్, రమ దంపతులు ఆధ్వర్యంలో మహాన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారిని పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల గ్రామపంచాయతీ బండ్లసిరి గుట్ట, గొందిగూడెం గ్రామాల్లో శ్రీదేవి, భూదేవి సమేత అభయ వేంకటేశ్వరస్వామి 18వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణ వేడుకకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కల్యాణాన్ని తిలకించటానికి పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, ఎంపీపీ ముత్తినేని సుజాత తదితరులు హాజరయ్యారు.



బండ్లసిరి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం

కన్నుల పండువగా కృష్ణ కల్యాణ మహోత్సవాలు

మణుగూరు , మార్చి 25: హోలీ పండుగను పురస్కరించుకుని మండలంలోని కొండాయగూడెం, పాత మణుగూరు గ్రామాల్లో శ్రీకృష్ణ దేవాలయాల్లో శ్రీ కృష్ణకళ్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాత మణుగూరులోని వేణుగోపాల దేవాలయం, కొండాయిగూడెం గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత సంతాన వేణుగోపాళ స్వామి ఆలయంలో నిర్వహించిన ఈ కళ్యాణ మహోత్సవాలను మణుగూరు, కొండాయిగూడెం, రామానుజారం గ్రామాల నుంచి వేలాది భక్తులు తరలి వచ్చారు. కొండాయిగూడెంలో మూడు రోజుల పాటు స్వామి వారి కళ్యాణ వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహిస్తూ రావడం ఆనవాయితీగా వస్తోంది. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య పాల్గొన్నారు.



మణుగూరు వేణుగోపాలస్వామి ఆలయంలో

ఏకుల పోతమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

దమ్మపేట, మార్చి 25: అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మొద్దులగూడెం క్రాస్‌రోడ్ వద్ద ఏకుల పోతమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యే పూజలు చేసారు. ఏకుల పోతమ్మ అలయ తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఏకుల పోతమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణనను, కొయ్యల అచ్యుతరావును సత్కరించారు. అనంతరం మొద్దులగూడెం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వాడపల్లి వంశి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. నాగుపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన పులిచర్ల నాగేంద్రప్రసాదు, పొన్నగంటి సూర్యనారాయణ, చీకటి సత్యావతి మృతికి నివాళులు అర్పించారు. అంకంపాలెం గ్రామానికి చెందిన కోండ్రు శ్రావణ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా సత్తుపల్లి వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బచ్చు సత్యనారాయణ, దొడ్డా బాస్కరరావు, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, వట్టి వెంకట్రావు, తదితరులు ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జారే

అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత క్షమాపణ చెప్పాలి

కరకగూడెం, మార్చి 25: గోదావరిఖని ప్రెస్ మీట్‌లో నేతకాని కులంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ నేత గుమ్మడి కుమారస్వామి తన వ్యాఖ్యలను వెనుక్కు తీసుకుని నేతకాని కులానికి క్షమాణ చెప్పాలని నేతకాని సంఘం రాష్ట్ర నాయకులు జాడి నాగరాజు, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రేమ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తాటిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అధికార పార్టీ బలుపుతో మా నేతకాని కులాన్ని నీతి, జాతి లేని కులమంటూ పొగరు పట్టిన మాటలు మాట్లాడిన కాంగ్రెస్ నేత గుమ్మడి కుమారస్వామిని వ్యాఖ్యలను ఖండిస్తున్నామని.. మా కులాన్ని అవమానించినందుకు అతనిపై కేసు నమోదు చేసి జైల్లో వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేతకాని కులస్థులు తెలంగాణ ఉద్యమంలో ముఖ్య పాత్ర పోషించామని, అందుకు మా కులానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇచ్చారని గుర్తుచేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ నేత గుమ్మడి కుమారస్వామి క్షమాణ చెప్పాలని, లేని పక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న నేతకాని సంఘం నేతలు

ఘనంగా చండీహోమం

అన్నపురెడ్డిపల్లి, మార్చి 25: అన్నపురెడ్డిపల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో సోమవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. చండీహోమంలో కొత్తగూడెం సివిల్ జడ్జ్ రామారావు దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అయనను అర్చకులు శాలువాతో సత్కరించి, ఆలయ విశిష్టతను వివరించారు.

వైభవంగా స్వర్ణలక్ష్మి పూజ

భద్రాచలం, మార్చి 23: భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో సోమవారం స్వర్ణలక్ష్మి అమ్మవారి సామూహిక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిత్య కల్యాణ మండపంలో అమ్మవారిని ఆసీనులను చేసి ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కుంకుమ, పుష్పాలతో అర్చన నిర్వహించారు. అలాగే ఈ సమయంలో పూజల్లో పాల్గొన్న మహిళలకు అమ్మవారి వెండి ప్రతిమ, లడ్డూ, పులిహోర ప్రసాదం, పూజా కుంకుమను అందించారు. కాగా ఉదయం స్వర్ణలక్ష్మి అమ్మవారికి అభిషేకాన్ని నిర్వహించారు. శ్రీ లక్ష్మి మహిళ సేవా సమితికి చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు అమరవాది శ్రీకాంతాచార్యులు, సంస్కృత పండితులు శ్రీ తిరుమలపీఠం అధ్యక్షులు ఎస్టీజీ శ్రీమన్నారాయణాచార్యులు పాల్గొన్నారు.



స్వర్ణలక్ష్మి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

వేంకటేశ్వరుడి తిరు కల్యాణం

దుమ్ముగూడెం, మార్చి 25: సున్నంబట్టి గోదావరి నదీ తీరాన వేంచేసిన వేంకటేశ్వరస్వామి తిరుకళ్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, అంకురార్పణ, విశ్వక్సేనపూజ, ఎదుర్కోలు, తిరుకళ్యాణాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానానికి విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అర్చకులు వీరయ్య, భక్తులు పిన్నింటి స్వాతి, కృష్ణబాబు, అర్జున్, నాగరాజు, ప్రభాకర్, శివరావు, నరేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాములోరికి గోటి తలంబ్రాల సమర్పణ

దుమ్ముగూడెం, మార్చి 25: భద్రాచల సీతారాముల కళ్యాణ మహోత్సవానికి గోటి తలంబ్రాలను సోమవారం స్థానిక భక్త బృందాలు అందజేశాయి. నరసాపురం చినఅరుణాచలం వ్యవస్థాపకులు శివనాగస్వామి తన భక్త బృందంతో కలిసి మండు టెండలో పదిహేను కిలోమీటర్లకు పైగా కాలినడకన భద్రాచలం చేరుకొని గోటి తలంబ్రాలనందజేశారు. అలాగే డబ్లుఎల్ రేగుబల్లి భక్తులు జెట్టి వెంకట్రాజు ఆధ్వర్యంలో గోటి తలంబ్రాలను స్వామి వారి సన్నిధిలో అందజేశారు. భక్తులు రాణి, సావిత్రి, సరోజిని, సుధారాణి, నాగేశ్వరి, రత్నకుమారి, వెంకటరమణ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి జయంతి

పాల్వంచ టౌన్, మార్చి 25: తెలంగాణ రాష్ట్రంలోనే పేరొందిన అయ్యప్ప స్వామి దేవాలయంగా కీర్తింపబడుతున్న పాల్వంచ అయ్యప్పస్వామి దేవాలయంలో ఫాల్గుణ మాసం, ఉత్తర నక్షత్రం జన్మనక్షత్రం సందర్భంగా అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు ఝాము నుంచే దేవాలయంలో పూజారులు మాధవన్ నంబూద్రీ, బృందావనం నర్సింహమూర్తి ఆధ్వర్యంలో గణపతి హోమం, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ ప్రత్యేక పూజలో ఆలయకమిటీ సభ్యులు కొత్వాల శ్రీనివాస రావు పాల్గొన్నారు.

విగ్రహా ప్రతిష్ఠా మహోత్సవం

మణుగూరు, మార్చి 25: మండలంలోని కూనవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సోమవారం విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ఎంతో వైభవంగా నిర్వహించారు. శ్రీరాముడు, సీతమ్మ, లక్ష్మణ అంజనేయ విగ్రహాలకు గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలందించిన వేద పండితులు సోమవారం ఆలయంలో ప్రతిష్ఠించారు. స్థానిక ఆలయ కమిటీ సభ్యులు, వందల సంఖ్యలో పాల్గొన్న కూనవరం పరిసర గ్రామాల భక్తులు, ప్రజల మధ్య ఓ పండుగ వాతావరణంలో ఈ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో పూజలు ప్రారంభం

అశ్వారావుపేట టౌన్, మార్చి 25: పట్టణ పరిధిలోని ఏఎస్ఆర్ నగర్‌లో ఈ నెల 27న శ్రీసంకటహర విఘ్నేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సోమవారం పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గణపతిపూజ, పుణ్యాహవాచన, పంచగవ్యప్రాశన, దీక్షాదారణ, యాగశాల ప్రవేశ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.